# ఎఱసంజ

"నువ్వు చెప్పిన సంగతి విన్నతరువాత, నాచిన్నతనంలో జరిగిన ఓ సంఘటన జ్ఞాపకమొస్తున్నది" అన్నాడు భావనారాయణ ఫక్కున నవ్వి.

"అదేమిటో?" అన్నాడు రామకృష్ణ.

ఆ ప్రశ్నకోసమే ఎదురుచూస్తున్న భావనారాయణ, చప్పున గొంతుసవరించుకొని, గడ్డంక్రింద గోక్కుని, రెండు చేతులూ వెనక్కువాల్చి, తాపీగా జారగిలబడి, 'ఏమిటంటే-' అని ప్రారంభించాడు.

"అప్పుడు నేను గుంటూరులో ఉంటుండేవాణ్ని. ఎందుకా? ఉద్యోగంచేయడానికి...

"యింకా పెళ్ళిపెటాకులూ కాలేదు. కామాక్షమ్మగారి హోటలని, అరండల్‌పేటలో, వేపచెట్టుకు ఈశాన్యంగా ఓభోజనంహోటలుండేది. అక్కడ భోంచేస్తుండేవాణ్ని. ట్రంకూ, పరుపుచుట్టా ఓమూలపెట్టుకొని, పడుకోమన్నది కామాక్షమ్మగారు. నాకే సయించలేదు. అదా— భోజనంహోటలు! అర్ధరాత్రీ అపరాత్రీ మనుషులొస్తుంటారు. పన్నెండుగంటలదాకా రద్దీగానే ఉంటుంది. ఓవేపు జనం అటూ ఇటూతిరుగుతుంటే, నేను పడుకోవడం భావ్యంగా ఉంటుందా? అసలు వీలుపడుతుందా?

"ఇప్పటికీ నాకు జ్ఞాపకం; ఆరోజు 12 వ తారీకు. ఆఫీసుకు సెలవుపెట్టి గదికోసం అన్వేషణ సాగించాను. ఆకాలంలో కొంపలు అద్దెకిచ్చుకోవడం మహాహీనంగా భావించేవారు చాలామంది. ఎవరో జులాయి మనుషులుతప్ప, మర్యాదస్తులెవరూ, ఇళ్ళు అద్దెకివ్వరని వారి అభిప్రాయం. నిజంగా, ఆరోజు నేను తిరిగినతిరుగుడు, కాస్తాకూస్తా కాదు. కంపనబడ్డ కాకిలా, ఊరంతాగాలించాను...ఎన్నోగడపలు ఎక్కిదిగాను. అదేంగ్రహచారమో, ఒక్కరూ గదిఉన్నదన లేదు. సాయంత్రంలోగా దొరక్కపోతే, అసలు ఉద్యోగమే వదిలిపెట్టి పోదామన్న నిశ్చయానికొచ్చాను...

"అదృష్టవశాత్తూ, నేను ఉద్యోగం వదలవలసినయోగం తప్పిపోయింది. సుందరమ్మగారు, మేడమీదిగది అద్దెకివ్వడానికి అంగీకరించింది. నే వెళ్ళి గదిచూశాను. చాలా బావుంది. గాలీ వెలుతురూ చక్కగా వస్తుంది. ఎలక్ట్రిఫైడ్. ఇంతా ఏడుస్తే నెలకు మూడురూపాయల అద్దె.

"అదేమిటోయ్! సత్యం! అలా ఆవలిస్తున్నావేమిటి? అంత ఇన్టరెస్ట్‌గా లేదా యేం?" అన్నాడు భావనారాయణ.

సత్యం ఉలిక్కిపడి లేచి కూచున్నాడు.

"నిజంగా, మన చిన్ననాటిసంగతులు, ఇప్పుడు జ్ఞప్తికితెచ్చుకొంటే ఎంత హాస్యాస్పదంగా ఉంటయ్! మనమేదో హేతువాదమని గుద్దుకు చస్తాంగానీ, మానవుడెప్పుడూ హేతువాదే నేమో ననిపిస్తుంది. భూమి నలుచదరంగాఉన్నదని నమ్మినప్పుడూ, మానవుడు హేతువునాపిం

చాడు. ఈనాడు గుండ్రంగా ఉన్నదనీ హేతువు చూపిస్తున్నాడు. ఇక మనం నరుక్కుచచ్చే ఈ'హేతువు' కు విలువేమిటో నా కర్థంకావడంలేదు."

"న్యాయానికి సుందరమ్మ నాకంటే అధమపక్షం, అయిదారేళ్ళు పెద్దది. అయినా ఆవిడగారి కంత వయస్సున్నట్టు ఎవ్వరూ అనరు. నా మట్టుకు నాకు ఆవిడ పాతికేళ్ళ దానిలా అవుపించేది. ఇంత చిన్నవయస్సులోనే, వైధవ్యం ప్రాప్తించిందేమిటి భగవంతుడా, అని నేను చాలాసార్లు అనుకొన్నాను. అప్పటికే వీరేశలింగంగారి ఉద్యమం ప్రబలంగాఉన్నా, అదింకా అందరికీ అందుబాటులో లేదు. ఈ సుందరమ్మజీవితం ఇలా వృథాకావలసిందేనా అని ఖేదించాను...

"మీరు చూడలేదుగానీ, సుందరమ్మ, చాలాఅందంగా ఉంటుంది. దానికితోడు ఇంత ఉన్నకుటుంబంలో కొచ్చిపడ్డది. భర్త పోతూపోతూ, పొలాలు, ఇళ్లూ ఇచ్చి మరీ పోయాడు...ఆనాలుగు మెతుకులూ ఉడకేసుకొని తింటుంది. గువ్వలా కూచుంటుంది...ఇప్పటికీ ఆసంగతి చెప్పడానికి, నేను చాలా సిగ్గుపడుతుంటాను. ఆకాలంలో, నేనెందుకు సుందరమ్మకోసం తహతహలాడానో, ఎందుకు ఆమెకోసం కలలుగన్నానో, ఇప్పుడు చెప్పలేను. వయస్సులో నాకంటే పెద్దదన్న జ్ఞానంగూడా నాకు లేకుండాపోయింది.

"ఒక్కో రాత్రి- ఒంటరిగా, దీపంఆర్పేసి పడుకొనే వాణ్ని. నిద్రపట్టేదికాదు. క్రిందినుండి సుందరమ్మ నడిచిన

చప్పుడో, దగ్గినశబ్దమో అయ్యేది. నరాలు జివ్వుమనిలాగేవి. మంచంలో, పడుకోలేకపోయేవాణ్ని. అందులోనూ, నేను నెత్తురు రుచిమరిగిన పులిపిల్లను. ఏదో అశాంతి, ఏదో సంక్షోభం, శోచనీస్థితి, నన్నుక్కిరిబిక్కిరిచేసేది. ఒక్కోసారి నన్ను నేనే శపించుకొనేవాణ్ని, నాకై నేను ఎంతయినా, 'ఇది' కావచ్చు. కానీ మరి సుందరమ్మ మాటేమిటి? ఆవిడతో ఎలా ఈవిషయం చెప్పడం? నా అభిప్రాయాన్ని ఎట్లా వ్యక్తంచేయడం? ఆవిడ ఇటువంటిది కాకపోవచ్చు...నమ్మి ఇల్లిచ్చినందుకు, నేను చేయువలసినపని ఇదేనా! అయినా ఈ నీతిబోధలు, నన్ను ఓదార్చలేకపోయేవి...

"నేను పదహారణాలా పప్పులో కాలు వేశానని, కొంత కాలానికిగానీ తెలియలేదు. సుందరమ్మ, నే ననుకొన్నట్లు మహాపతివ్రత కాదు. ఆవిడ కొకరిద్దరు ప్రియులున్నారు. వారు అప్పుడప్పుడు, ఆయింటికివచ్చిపోవడం నేను స్వయంగా చూశాను. ప్రథమంలో సుందరమ్మమీద నాకు చిన్న అభిప్రాయమేకలిగింది కానీ, అది కూడదని సరిపెట్టుకొన్నాను. సుందరమ్మ మహాపతివ్రత కాకపోవడమే చాలా మేలయింది. అదే అన్యోపక్షంలో, ఆవిడ నాకు లభించడం-దాదాపు అసంభవం! ఆవిడ నీ 'పాపకార్యం' లోకి ఇదివరకే కొందరు ప్రవేశపెట్టారుగనుక, ఇప్పుడా ప్రాథమికమైన సాధకబాధకాలు పడవలసిన అవసరం నాకులేదు. రాచమార్గం ఇదివరకే వేయబడి ఉన్నది. నాపనల్లా ఆమార్గం వెంట వెళ్ళడం.

ఏదైతే అదే అవుతుందని, తెగించాను. నేను తన కోసం పడే "తపన" ను వైనవైనాలుగా చెప్పాను. ఎలా సాహసించానా ? చావుకు తెగించినవాడికి సముద్రం లోతేమిటర్రా !

"సుందరమ్మ చాలా ప్రశాంతంగా విన్నది. ఒక్క నిట్టూర్పు విడిచింది. కొన్నిక్షణాలు నావేపు చూసింది. తల వంచుకొంది. ఔననీ అనలేదు. కాదనీ అనలేదు ... నేనే సమీపించాను. ఆవిడ కదల్లేదు. మెదల్లేదు ... వేగంగా కొట్టుకొనే గుండెను కుదుటబరుచుకొని, సుందరమ్మ భుజాలమీద చేతులువేసి, దగ్గరకు తీసుకొన్నాను ... సుందరమ్మ మెల్లిగా నన్ను హత్తుకొంది.

"అంతే ! అంతకుమించిన అనుభవం ఆమెనుండి పొందలేకపోతున్నాను. ఎన్నోసార్లు ప్రాధేయపడ్డాను. బ్రతిమిలాడాను. బెదిరించాను...ఆమెజుట్టు చిందరవందర చేశాను. పాపం ! అన్నిటినీ, అలా మౌనంగా భరించేది. కౌగిలిలో పిట్టలా ఇమిడిపోయేది. రక్తం అర్చుకుపోయేలా చుంబించేది ... కేశవరావ్ ! నా అవస్థ ఆ పరమేశ్వరుడికి తెలియాలి. ఆ కొంపను విడిచిపోనూ పోలేను. ఉండి, ఈ ఘోరహింస భరించనూ భరించలేను ...

"ఒకరోజు తాడో పేడో తేల్చుకుందుకు సిద్ధపడ్డాను. సాయంత్రమే ఇల్లు ఖాళీచేస్తున్నానని చెప్పాను. ఎంతబాధ పడ్డదని ! దాదాపు కన్నీళ్ళపర్యంతమయింది. వెళ్ళవద్దంటుంది. "నీవంటే నాకు చాలా యిష్ట" మంటుంది. ఈ

బలహీనత నాకు బాగా ఉపకరించింది. నేను కాదు కూడ దన్నాను. చివరికి, ఈ ఒక్క రాత్రీఉండి, పోవాలనుకొంటే, రేపు వెళ్ళమన్నది ...

"ఇక నే నేమయిఉంటానో ఆలోచించు ... ఆ చీకటిగదిలో నేను ప్రతిక్షణం ఎలా గడిపానో ఇప్పుడు చెప్పలేను. క్రిందినుండి, గడియారం పన్నెండుగంటలు వినిపించింది ... మరో పదినిముషాలకు బరువైన అడుగులు మెట్లెక్కుతున్నాయి ...

"మీరు మరోలా అనుకోకండి. నిజంగా కామం, పదహారణాల గుడ్డిదే! కాకపోతే సుందరమ్మ చెప్పిందాకా, నేను రాత్రి మరొకస్త్రీతో గడిపానని తెలుసుకోకుండా ఉంటానా? ఈ సంగతి విన్నప్పుడు, నేను నిలువునా కుంగిపోయ్యాను. బావురుమని ఏడవాలనిపించింది ... సుందరమ్మ నన్ను దగ్గరకు తీసుకొని మెత్తగా కౌగలించుకొంది. వెచ్చటికన్నీరు, భుజాలను తడిపింది ...

"బాబూ! నువ్వంటే నాకు చాలాఇష్టం! కానీ నువ్వీమాట నమ్మవు ... నిన్ను నమ్మించడం నావల్ల కాదు ... నీతికోసం, శీలంకోసం గాదు నేను విచారించేది; ఆ సంగతి నీకూ తెలుసు. నీలాంటి ఆరోగ్యవంతుణ్ణి, ఎంతో ముందుజీవితం గలవాణ్ణి, ఒక్క అనుభవంతో, నాశనం చెయ్యలేను. నీ రక్తాన్ని విషకలుషితం చెయ్యడం నాకిష్టంలేదు ... చూస్తూచూస్తూ ఓ సంపెంగపువ్వును, ఎలా నిప్పుల్లోకి విసరను బాబూ!" అన్నది సుందరమ్మ.

"నేను దిమ్మెరపోయాను."